ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 28 జూలై 2025

సంబురంగా సీత్లా వేడుకలు



ఆమనగల్లు మండలం శంకర్‌కొండ తండాలో ఆదివారం సీత్లా సంబురాలు అంబరాన్నంటాయి. శ్రావణమాసంలో ప్రతియేటా గిరిజనులు ఈ వేడుకను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. మహిళలు గ్రామ సమీపంలోని సీత్లా మాత ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలందరినీ చల్లంగా చూడాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. సీత్లా మాత ఊరేగింపులో యువతీ యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. శ్రీనునాయక్, వసురామ్ నాయక్, ప్రశాంత్‌నాయక్, పంతూనాయక్, మండ్లీ రాములు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

- ఆమనగల్లు, జూలై 27(ఆంధ్రజ్యోతి)



శంకర్‌కొండ తండాలో సీత్లా మాత ఊరేగింపులో గిరిజనులు

అమ్మోరు తల్లీ.. చల్లంగా చూడు



గోవిందాయిపల్లి తండాలో బోనాల ఊరేగింపు

కడ్తాల్ మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో ఆదివారం ముత్యాలమ్మ బోనాలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, యువతులు బోనం కుండలను అలంకరించుకొని బ్యాండ్ వాయిద్యాలతో ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు. ముత్యాలమ్మ, జగదాంబదేవిలకు నైవేద్యం సమర్పించారు. అమ్మోరు తల్లో.. చల్లంగా చూడంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాము నాయక్, సాయిలాల్, చత్రునాయక్, సంతోష్, రాజేందర్, సికిందర్, జగన్, బీచ్యనాయక్, గణేశ్, భాస్కర్, నిరంజన్, సక్రు, గూడూరు లక్ష్మీనర్సింహా రెడ్డి, దశరథ్ నాయక్, యాట నర్సింహ్మా, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్, కడారి రామకృష్ణ పాల్గొన్నారు.

- కడ్తాల్, జూలై 27(ఆంధ్రజ్యోతి):

విద్యుత్ మరమ్మతులకు రూ. 25లక్షలు

కేశంపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల కేంద్రంలో విద్యుత్ మరమ్మతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 25లక్షలు మంజూరు చేసిందని కేశంపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు యెన్నం శ్రీధర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నేడు(సోమవారం)నుంచి పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. గత 50 ఏళ్ల కింద వేసిన విద్యుత్ లైన్లను ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. చాలా కాలంగా విద్యుత్ లైన్‌ను పట్టించుకోక పోవడంతో, వైర్లు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. కేశంపేట ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకుపోగా.. రూ. 25లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



నిండుకుండలా..

జలాశయాలకు జలకళ
పొంగిపొర్లుతున్న చెరువులు, కుంటలు
8

శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి
6
విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

అక్షర ఉల్లాసం!

అక్షరాస్యత వైపు అతివలు

- స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ చదువు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 'ఉల్లాస్' కార్యక్రమం
- మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక
- ఆగస్టు మొదటి వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు
- వలంటీర్లకు శిక్షణా కార్యక్రమాలు.. డ్రాపవుట్లకు ఉన్నత విద్య
- ఉమ్మడి జిల్లాలో 1,61,509 మంది నిరక్షరాస్యుల గుర్తింపు



'అందరికీ చదువు.. అందరి బాధ్యత' అనే నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఉల్లాస్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. అతివలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఆగస్టు మొదటి వారం నుంచి దీనిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం ఉల్లాస్ పోర్టల్, మొబైల్ యాప్ రూపొందించారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల్లోని మహిళలను 100శాతం అక్షరాస్యులుగా మార్చాలనేది ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 1,61,509 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారు. వీరిందరికీ చదువు చెప్పేందుకు వలంటీర్లను నియమిస్తారు. సంఘాల్లో చదువుకున్న మహిళలు, ఆసక్తిఉన్న విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులను వలంటీర్లుగా ఎంపిక చేయనున్నారు.



1,61,509 మంది..

ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో ఈ కార్యక్రమం అమలు కోసం ఇప్పటికే నిరక్షరాస్యుల సంఖ్యను తేల్చారు. ప్రభుత్వ వద్ద ఉన్న గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 1,61,509 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. ప్రస్తుతం వీరందరి డేటాను సేకరిస్తున్నారు. ఈ వివరాలను కంప్యూటరీకరిస్తున్నారు. రంగారెడ్డిజిల్లాలో అత్యధికంగా 73,832 మంది నిరక్షరాస్యులు ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : చదువురాని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించింది. పాఠశాల విద్యావకాశం కోల్పోయిన 15ఏళ్లకు పైబడిన నిరక్షరాస్యులందరికీ జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ప్రాథమిక అక్షరాస్యత అందించేందుకు 'ఉల్లాస్' (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. ఆగస్టు మొదటి వారంలో అధికారికంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల్లోని మహిళలను 100 శాతం అక్షరాస్యులుగా మార్చేందుకు దీనిని రూపొందించారు. వాస్తవానికి ఈ బృహత్తర కార్యక్రమాన్ని గత ఏడాదే ప్రారంభించాలని భావించినా వయోజన విద్యాశాఖలో సిబ్బంది కొరత కారణంగా

మిగతా 6వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో నిరక్షరాస్యుల వివరాలు

జిల్లా	సంఖ్య
రంగారెడ్డి	73,832
మేడ్చల్	47,867
వికారాబాద్	39,810

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌భూపాల్‌గౌడ్

చేవెళ్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం చేవెళ్లలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంజర్ల ప్రకాశ్‌లతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకుల మాటలను నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు కుమార్‌గౌడ్, వాసుదేవ్‌కన్నా, చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు జి.కృష్ణగౌడ్ ఉన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంచాలి



చేవెళ్లలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు దివ్యాంగుల పెన్షన్‌ను ఆరు వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం చేవెళ్లలో వారు మాట్లాడుతూ... వచ్చే నెల 2వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్వహించనున్న చేయూత పెన్షన్ దారుల సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ, చేవెళ్ల మండల అధ్యక్షుడు ఊరెంట ప్రవీణ్ మాదిగ, శంకర్‌రావు, ప్రవీణ్, భానుప్రసాద్ ఉన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్ల అర్హత పరీక్షకు సంబంధించి శంషాబాద్ పాలమాకులలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌ను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన పరీక్షకు 329 మంది హాజరు కాగా, 74 మంది గైర్హాజరయ్యారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా సర్వే అండ్ ల్యాండ్స్ అధికారి కే.శ్రీనివాస్, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, తహసీల్దార్ దత్ తదితరులు ఉన్నారు. అలాగే బాలాపూర్ మండలం జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన గ్రామ పాలన అధికారి పరీక్షా కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఏవో సునీల్ తనిఖీ చేశారు. వీరి వెంట మండల తహసీల్దార్ ఇందిరా దేవి ఉన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 111 మంది అభ్యర్థులకు గాను 101 మంది హాజరు కాగా, 10 మంది గైర్హాజరయ్యారు.



అసంపూర్తిగా నిలిచిన బంజారా భవన నిర్మాణం

విడుదల కాని నిధులు అసంపూర్తిగా పనులు

- ఆమనగల్లులో నిలిచిన బంజారా భవన నిర్మాణం
- భవనానికి రెండు కోట్ల రూపాయలు కేటాయింపు
- బిల్లులు అందక పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- త్వరగా పూర్తి చేయాలని గిరిజన సంఘాల వినతి

ఆమనగల్లు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో బంజారా భవన నిర్మాణం నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఆ భవనం వినియోగంలోకి రాక మూగ జీవాలకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేసి పనులు పూర్తిచేయాలని గిరిజన సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఆమనగల్లులో బంజారా భవనం నిర్మించాలని ఏళ్ల కాలంగా గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. దీంతో 2023లో అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చొరవతో పట్టణ సమీపంలోని కల్వకుర్తి రోడ్డులో బంజారా భవన నిర్మాణానికి 30 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా

మిగతా 8వ పేజీలో...

నిర్మాణం పూర్తి చేయాలి



ఆమనగల్లు పట్టణంలో బంజారా భవన్ అసంపూర్తి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలి. ఈ విషయంలో పాలక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం బంజారా భవన్ నిర్మాణానికి రూ.2కోట్లు నిధులు, 30 గుంటల స్థలాన్ని కేటాయించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ప్రారంభించినా నిధులు విడుదల చేయని కారణంగా పనులు నిలిచిపోయాయి.

నేనావత్ పత్యానాయక్, ఆమనగల్లు

నేడు ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్ రాక

షాబాద్/శంకర్‌పల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): షాబాద్‌లో నేడు(సోమవారం) ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి తో కలిసి ఉదయం 9 గంటలకు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అదనపు తరగతి గదులు, ల్యాబ్‌కు శంకుస్థాపన చేస్తారని, షాబాద్ పీహెచ్‌సీలో వనమహోత్సవం, ఎంపీడీవో కార్యాలయంలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాలకు హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే శంకర్‌పల్లి పట్టణంలోని మణిగార్డెన్‌లో రేషన్‌కార్డులను పంపిణీ చేస్తారని తహసీల్దార్ సురేందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ నారాయణరెడ్డి హాజరవుతారని వివరించారు.

సీఎంకు కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

శంషాబాద్/ ఇబ్రహీంపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రిపై కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆదివారం శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డి శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జే. నరేందర్ యువజన కాంగ్రెస్ నాయకులు మహేందర్, కోటేశ్వర్‌గౌడ్, ఆనంద్, దయాసాగర్, సైనికేష్, అభి, కిరణ్‌గౌడ్, ప్రేం, ఇర్ఫాన్ పాల్గొన్నారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్‌రెడ్డిలకు ఫిర్యాదు చేశారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వెదిరె సికిందర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి రావుల నాగరాజు, ఎన్ఎస్‌యూఐ నాయకులు విశ్వనాథ్ చారి, కె.నరేందర్‌రెడ్డి, సోహెల్‌లు ఉన్నారు.

మెటీరియల్ కొనుగోళ్ల నిలిపివేత

- శానిటేషన్ సామగ్రి ఆర్డర్ రూ.18లక్షలకు కుదింపు
- హాకాను కాదని ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగింతకు నిర్ణయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): కార్మికుల పేరిట భారీ కుంభకోణానికి తెరలేపిన తాండూరు మున్సిపల్ అధికారులు వెనుకడుగు వేశారు. జూన్20న 'టెండర్ లేకుండా రూ.అరకోటి శానిటేషన్ మెటీరియల్ ఆర్డర్' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో కొంత మెటీరియల్‌ను తెప్పించి మిగతా వాటి సరఫరాను నిలిపేశారు. రూ.50లక్షలతో మున్సిపల్ శానిటేషన్ కార్మికులకు మెటీరియల్ కొనుగోలుకు నిర్ణయించి ఆర్డర్‌ను మున్సిపల్ కమిషనర్ హకాకు కట్టబెట్టారు. మార్కెట్‌లో లేని రేట్లతో మెటీరియల్ ఆర్డరిచ్చి కమిషన్ ఒప్పందాలు చేసుకున్నారనే ఆరోపణలొచ్చాయి. దీనిపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సీరియస్ వార్నింగ్ ఇవ్వడంతో అధికారులు వెనకడుగు వేశారు. మెటీరియల్ కొనుగోలుపై కలెక్టర్ సైతం మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. దీంతో ప్రస్తుతం వచ్చిన మెటీరియల్‌కు రూ.18లక్షలు బిల్లులు ఇచ్చేందుకు చెక్కు రెడీచేశారు. బిల్లు చెల్లింపునకు చూపుతున్న ఉత్సాహం కార్మికులకు పూర్తిస్థాయిలో మెటీరియల్ ఇవ్వడంలో ఎందుకు చూపడంలేదనే విమర్శలొస్తున్నాయి. జూన్18న మున్సిపాలిటీకి మెటీరియల్ రాగా నెలరోజులు గడిచినా మెటీరియల్ రూమ్‌లోనే నిల్వ ఉంది. పని చేసే సమయాల్లో కార్మికుల రక్షణ కోసం, ఆరోగ్య భద్రత కోసం సరఫరా చేసే ఈ మెటీరియల్ నాసిరకంగా ఉందని కార్మికులు చెబుతున్నారు. కాగా మరికొంత మెటీరియల్‌ను మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రైవేట్ ఏజెన్సీ నుంచి కొనుగోలుకు అధికారులు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. ఇప్పటికే వచ్చిన మెటీరియల్ వివరాలను బయటపెట్టేందుకు సైతం నిరాకరిస్తున్నారు. ఇటీవల అధికారులకు అనుకూలంగా ఉన్న సిబ్బందితో మెటీరియల్‌పైన ఉన్న ధరల స్టిక్కర్లను తొలగించినట్టు కార్మికులకు తెలిపారు. ఇదిలా ఉంటే ఆంధ్రజ్యోతి కథనంతో అటు ఎమ్మెల్యే, ఇటు కలెక్టర్ స్పందించి శానిటేషన్ మెటీరియల్ కొనుగోలుపై చేయాలనుకున్న దుబారా వ్యయాన్ని కొంత అరికట్టినట్టయింది. కాగా ఇప్పటి వరకు కార్మికులకు రెగ్జిన్ కోర్టులు, డ్రెయిన్లు శుభ్రపరిచే ఇనుప వస్తువులు, కొడవళ్లు, కత్తులు వంటి పరికరాలు మాత్రమే ఇచ్చారు. వారి ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగించే సబ్బులు,నూనెలు, డ్రెస్సులు మాత్రం ఇంకా ఇవ్వలేదు.


తాండూరు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న మెటీరియల్


అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మూడుచింతలపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ అన్నారు. అద్రాస్‌పల్లిలో వ్యాధులపై ఆదివారం ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారి ఉష, ఆశావర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టు పరిశీలన

ధారూరు, జూలై27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టును ఆదివారం ఇరిగేషన్ అధికారులు సందర్శించారు. డ్యాంను ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టు సామర్థ్యం, ప్రస్తుత నీటి మట్టం, ఇన్‌ఫ్లో ఔట్‌ఫ్లోపై డీఈఈ భాస్కర్ గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈఈ వెంట ఏఈ రవితేజ, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.


ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి

అక్షర ఉల్లాసం!

(ఐదో పేజీ తరువాయి)

వాయిదా వేశారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) సహకారంతో దీన్ని నిర్వహిస్తున్నారు. నిరక్షరాస్యులకు ప్రాథమిక విద్యతో పాటు వారికి డిజిటల్ అక్షరాస్యత, కీలకమైన జీవన నైపుణ్యాలు, ఆర్థిక అక్షరాస్యత, వృత్తి, నైపుణ్యం, నిరంతర విద్యను అందించే లక్ష్యంతో 'ఉల్లాస్' కార్యక్రమాన్ని తీర్చిదిద్దారు. 'అందరికీ చదువు.. అందరి బాధ్యత' అనే నినాదంతో దీన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. నవ భారత్ సాక్షర కార్యక్రమం కింద ఈ కేంద్ర ప్రాయోజిత పథకాన్ని రూపొందించింది. ఉల్లాస్ కార్యక్రమం కింద ఎంపిక చేసిన వారికి అవగాహనతో చదవడం, రాయడం అంకెలు గుర్తించడం, కనీస సామర్థ్యాలతో కూడిన లెక్కలు చేయడం వంటివి నేర్పుతారు. ఇందుకోసం ఉల్లాస్ పోర్టల్, మొబైల్ యాప్ రూపొందించారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాలలో అక్షరాస్యత కార్యక్రమాలు అమలు చేయనున్నారు. నిరక్షరాస్యులు, వాలంటీర్ల పేర్లను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఎంపిక చేసిన వారికి సామాజిక చైతన్య కేంద్రాలు (ఎస్‌సీకే) అంటే ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాలు, ఉన్నత విద్యాసంస్థలు, ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్థానిక సంస్కృతి కేంద్రాలు, లైబ్రరీలలో క్లాసులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డీటీహెచ్, టీఈఈ ఛానల్ నంబరు 14లో క్రమం తప్పకుండా ప్రాంతీయ భాషల్లో వయోజన అభ్యాసకుల కోసం పాఠాలను ప్రసారం చేస్తారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక పుస్తకాలు తయారు చేస్తున్నారు. ఉల్లాస్ కార్యక్రమం కింద స్వచ్ఛందంగా పనిచేసే చురుకైన విద్యార్థులకు విద్యా క్రెడిట్లను ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏపీసీటీఈ, ఎన్‌సీటీఈ అనుబంధ సంస్థలకు యూజీసీ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కార్పొరేట్ సంస్థలను భాగస్వాములుగా చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో డీఈవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్, డీఆర్‌డీవో, డీఈవో, మెప్మా పీడీ, సెర్ప్, జిల్లా వైద్యారోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా పరిషత్ సీఈవోలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.



వలంటీర్ల నియామకం

డ్వాక్రా గ్రూపుల్లో చదువుకోని మహిళలను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతారు. వీరికి అక్షర జ్ఞానం నేర్పేందుకు వలంటీర్లను నియమిస్తున్నారు. సంఘాల్లో చదువుకున్న మహిళలను ఎంపిక చేసి వీరికి వలంటీర్ల బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఎంపిక చేసిన వలంటీర్లకు శిక్షణ ఇస్తున్నారు. వీరిలో ఒక్కొక్కరు 10 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి. ఆసక్తి ఉన్న విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులను సైతం వలంటీర్లుగా నియమిస్తున్నారు. చదువుతో పాటు ఆరోగ్యం, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తారు. అలాగే ఆసక్తిగల వారికి తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) నుంచి 10వ తరగతి చదువుకునేలా ప్రోత్సహిస్తారు. గతంలో ఏదైనా కారణాల వల్ల పదో తరగతి మానేసిన వారిని గుర్తించి ఓపెన్ పది, పది తరువాత మానేసిన వారిని ఓపెన్ ఇంటర్ చదువుకునేలా సన్నద్ధం చేస్తారు.


శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆహార పదార్థాలు కల్తీ చేస్తే చర్యలు

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలన్నదే రాష్ట్ర ఫుడ్ కమిషన్ ధ్యేయమని కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆహార పదార్థాలు కల్తీ చేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమనగల్లు మండలంలో ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. విఠాయిపల్లి వద్ద ముర్తోజుపల్లికి చెందిన చాట్ల శ్రీను ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి పథకాన్ని శ్రీనివాస్‌రెడ్డి నాయకులతో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత సన్మార్గంలో మెదులుతూ జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలన్నారు. ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానమని, సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తి బాలస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, సుమన్‌నాయక్, సుభాష్, ప్రసాద్, శివకుమార్, సతీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల పెంపే ప్రభుత్వ ధ్యేయం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 27, (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాల పెంపే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 18నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అద్భుత విజయాలు సాధించిందని తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యువకులు ఏర్పాటు చేసుకున్న ఉపాధి పథకాలను ప్రారంభించారు. పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే, నాయకులు అందజేశారు. సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ప్రతీ పేద కుటుంబానికి మేలు జరుగుతోందన్నారు. నిరుపేదలందరికి ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న కల్వకుర్తి నియోజకవర్గం సీఎం రేవంత్ రెడ్డి చొరవతో వేగవంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. పాత రోడ్ల అభివృద్ధికి, కొత్త రోడ్ల నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశామని నారాయణ రెడ్డి చెప్పారు. అభివృద్ధిలో రాజకీయాలకు తావు లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ 90శాతానికిపైగా స్థానాల్లో గెలవడం తథ్యం అన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్‌యాదవ్, భూపతిరెడ్డి, పర్వతరెడ్డి, మోతీలాల్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, కేశవులు, డి.ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, టి.రవీందర్, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.

బీజేపీ వైపు యువత చూపు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి


రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

వికారాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ వైపు యువత అంత ఎదురు చూస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణానికి చెందిన యువనాయకుడు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు యువకులు బీజేపీ లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వచ్చే స్థానిక సంస్థలు, మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని, యువకులు ఆ దిశగా కష్టపడి ముందుకు నడవాలన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను తీసుకోవాలన్నారు. వీరేశ్, నర్సిములు, ఉదయ్, నరేష్ కుమార్, సిద్దిరాములు పార్టీలో చేరగా, మోహన్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్కటూర్ బ్రిడ్జిని అందుబాటులోకి తెస్తాం

తాండూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు తెగిన బెల్కటూర్ తాత్కాలిక బ్రిడ్జిని త్వరలోనే అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం తాండూరు మండల పరిధిలోని బెల్కటూర్ బ్రిడ్జిని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే బ్రిడ్జి పనులు పూర్తి చేయించి, అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అనంతరం చంద్రవంచలోని ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, డాక్టర్ సంపత్, సుదర్శన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి

కందుకూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలని, అప్పుడే దేశం మరింత పురోగతి చెందుతుందని అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి తెలిపారు. తన స్వగ్రామమైన రాచులూరులో శివాజీ విగ్రహం ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ చేశారు. బి.రాంరెడ్డి, నర్సింహ్మ, కృష్ణగౌడ్, చంద్రయ్యచారి, శంకర్‌గౌడ్, రాజు, సురేష్‌చారి, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.


విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న వెదిరె రవికాంత్ రెడ్డి

అబ్దుల్‌కలాం ఆశయ సాధనకు కృషిచేయాలి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయసాధనకు యువత కృషిచేయాలని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని అవుశాపూర్‌లో కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మశ్చేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సాయిలు, రఘు, సదానంద్‌రెడ్డి పాల్గొన్నారు.


కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న సుదర్శన్‌రెడ్డి



అమ్మోర్లకు బోనం..!

కీసర/ఘట్‌కేసర్‌రూరల్/ఘట్‌కేసర్, జూలై27(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కొండాపూర్, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్జీకే కాలనీ, అన్నోజిగూడ, యంనంపేట్, పోచారంలలో బోనాల పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుండే అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. రాత్రికి ఫలహారం బండ్లతోపాటు తొట్టెల ఉరేగింపులు నిర్వహించారు. ఎదులాబాద్, మర్రిపల్లిగూడల్లో ఉదయం నుంచి సందడి వాతావరణం నెలకొన్నది. బంగారు మైసమ్మ, నల్లపోచమ్మ, మహంకాళి, దుర్గమాతలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలల్లో బోనాల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. భోగారం, గోధుమకుంట, రాంపల్లి దాయర, లాలోనిగూడ ప్రాంతాలల్లో మహిళలు గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు.


మర్రిపల్లిగూడలో బోనాల ఊరేగింపు




లాలోనిగూడలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఉద్యమాలను తీవ్రం చేయాలి



సభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ స్ఫూర్తితో ఉద్యమాలను తీవ్రతరం చేయాలని సీపీఎం రాష్ట్ర కారదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ ఐదో వర్ధంతి సభలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండానే మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలుపకుండా కేంద్ర ప్రభుత్వం మోకాలడ్డుతోందని, తెలంగాణకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతోందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్య రంగాలను కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చేసిన వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. సమసమాజ స్థాపన ఎర్ర జెండాతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, నాయకులు భాస్కర్, సామేల్, మధుసూదన్‌రెడ్డి, అరుణ, రాంచందర్, జగన్, నర్సింహ, కవిత, చంద్రమోహన్, బుగ్గ రాములు, జంగయ్య, సుమలత తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పేరిట సేవలు ప్రశంసనీయం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పర్వతాలు, ఇతర నాయకులు

శంషాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు అరుదైన గౌరవం ఇవ్వడం ప్రశంసనీయమని, వారిపేరిట సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పానుగంటి పర్వతాలు అన్నారు. భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నెపు ప్రభు తల్లి నీలమ్మ 9వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ప్రభు కుటుంబీకులు జిల్లా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పర్వతాలు పాల్గొని ప్రసంగించారు. ఏటా ప్రభు అన్నదాన కార్యక్రమం చేపట్టడం హర్షనీయమన్నారు. తల్లి చనిపోయి తొమ్మిదేళ్లవుతున్నా ప్రతీ సంవత్సరం ప్రభు కుటుంబీకులు ఆమె పేరిట అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి మార్గదర్శకం అని కొనియాడారు. ప్రభును ఆదర్శంగా తీసుకొని ప్రతీ ఒక్కరు తమ తల్లిదండ్రులను ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్.యాదగిరి, నర్రాగిరి, మల్లేష్, జైపాల్‌రెడ్డి, గడ్డం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న శ్రీరామ్

మొయినాబాద్ రూరల్, జూలై 27(ఆంధ్యజ్యోతి):విద్యార్థులు ఇంజనీరింగ్ పట్టాలు పొందడం కాదు.. వారు జీవిత లక్ష్యాలను ఎంచుకొనే దశ ఇదని తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరామ్‌వెంకటేష్ అన్నారు. ఆదివారం మొయినాబాద్ పరిధి అజీజ్‌నగర్ చౌరస్తాలోని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామ్ పాల్గొని మాట్లాడారు. విద్యలో స్థిరత్వం, నైతికత, నిరంతర అభ్యసనాలు ముఖ్యమని సూచించారు. కళాశాల చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజసేవల్లో ముందుండాలని సూచించారు. విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలను తాను 1998లో స్థాపించానని, అప్పటి నుంచి విద్య, పరిశోధన, పరిశ్రమల అనుసంధానంతో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషిచేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సృజన, శ్రీరాంరెడ్డి, కృతివాసన్, అహ్మద్, మహ్మద్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే జర్నలిస్టుల డిమాండ్ల సాధన



సమావేశంలో మాట్లాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

షాద్‌నగర్ అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ఐకమత్యంగా పోరాడితేనే డిమాండ్లు సాకారం అవుతాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. షాద్‌నగర్ సమీపంలోని ఓ రిసార్ట్‌లో ఆదివారం టీడబ్ల్యూజేఎఫ్ షాద్‌నగర్ డివిజన్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాగా సోమయ్య సమక్షంలో సీనియర్ జర్నలిస్టులు ఎల్.మోహన్‌రెడ్డి, టి.సంజయ్‌కుమార్, కె.రంగనాథ్, ఖాజాపాషా, రమేష్, వేణుగోపాల్, మన్సూర్ అలీ, అశోకచక్రవర్తి తదితరులు ఫెడరేషన్ సభ్యత్వం తీసుకున్నారు. సోమయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు హామీలిస్తున్న రాజకీయ పార్టీలు అధికారంలోకి రాగానే జర్నలిస్టుల సమస్యలను పక్కన పెడుతున్నాయన్నారు. జర్నలిస్టుల శ్రమ, మద్దతుతోనే తెలంగాణ ఉద్యమం ఎగిసి స్వరాష్ట్రం వచ్చినా.. జర్నలిస్టుల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో జర్నలిస్టులకు చేసిందేమీ లేదని, కొత్త ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చి, నిర్మాణాలకు సహకరిస్తామని చెప్పి ఏడాదిన్నరగా మౌనంగానే ఉంటున్నారని అన్నారు. సంఘటిత పోరాటంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్‌కార్డులతో పాటు ఇతర డిమాండ్ల సాధన కోసం చేపట్టబోతున్న ఉద్యమానికి జర్నలిస్టులంతా కలిసి రావాలని ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సైదులు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు దేవేందర్, రఘుపతి, గణేష్ పిలుపునిచ్చారు. యూనియన్ డివిజన్ అధ్యక్షుడు రఘువేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు శ్రీనివాస్‌చారి, ఎల్.రమేష్, మల్లేష్, నరేష్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

దుద్యాల, జూలై 27(ఆంధ్రజ్యోతి): దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కర్ణాటకలోని జాకన్‌పల్లి మఠాధిపతి సిద్ధలింగేశ్వర మహాస్వామి అన్నారు. ఆదివారం చిల్మల్ మైలారంలో వినయ్‌కుమార్ నివాసంలో ఇష్టలింగ, గురువు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటించాలని సూచించారు.



టేకుల్‌కోడ్ సమీపంలో సాగు చేసిన పత్తి పంట

పంటలు కళకళ

● కురుస్తున్న వర్షంతో మొక్కలకు జీవం

కొడంగల్ రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితులతో అల్లాడిన రైతులకు గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలు సంతోషాన్నిచ్చాయి. పంటలకు జీవం పోశాయి. పత్తి, పెసర, కంది, మినప పంటలు కళకళలాడుతున్నాయి. మొన్నటి వరకు వాడిన మొక్కలు ఈ వర్షాలతో పచ్చబారాయి. పెసర పంట కాతకు రావడంతో కురుస్తున్న వర్షాలతో కాపు బాగా వస్తుందని రైతులు తెలిపారు. పంటలపై డీఏపీ, ఇతర ఎరువులు పిచికారిలో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు బోరు బావులు, చెరువుల కింద వరి నాటు పనులను ముమ్మరం చేశారు.

ఆధ్యాత్మిక బోధనతో బాల గోకులం

తాండూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): బాల గోకులంలో విద్యార్థులకు ఆధ్యాత్మిక అంశాలను బోధిస్తున్నారు. ఆదివారం తాండూరు పట్టణం భవానీనగర్ రామలింగేశ్వర ఆలయంలో బాల గోకులాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటధర్మ చక్రాలు విద్యార్థులకు భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామ శ్లోకాలను నేర్పించారు.




బాల గోకులంలో పాల్గొన్న విద్యార్థులు

కాగ్నా బ్రిడ్జికి రంధ్రం

● వాహనదారులకు తప్పిన ముప్పు
● రూ.17కోట్ల నిధులతో నిర్మాణం
● రెండేళ్లకే బయటపడ్డ నాణ్యతా లోపం
● రోడ్డుపై రాకపోకలకు ఆటంకాలు
● పరిశీలించిన అధికారులు, ఎమ్మెల్యే, నాయకులు, పోలీసులు





కాగ్నా నది బ్రిడ్జిపై పడిన రంధ్రాలు, పగుళ్లు

తాండూరు/యాలాల, జూలై 27(ఆంధ్రజ్యోతి): తాండూరు-కొడంగల్ రోడ్డుపై ఉన్న కాగ్నా నది బ్రిడ్జిపై పెద్ద రంధ్రాలు, పగుళ్లు ఏర్పడ్డాయి. నాసిరకంగా నిర్మించడంతో పనులు చేసిన రెండేళ్లకే బ్రిడ్జిపై పెద్ద రంధ్రాలు పడ్డాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈ బ్రిడ్జి కట్టారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి బ్రిడ్జిపై కొన్నిచోట్ల సీసీ లేచిపోయి స్టీలు తేలింది. ఆదివారం ఈ రోడ్డుపై వెళ్లే ద్విచక్ర, భారీ వాహనదారులు ఏర్పడిన రంధ్రాన్ని చూసి కలవరపడ్డారు. వాహనాలను త్రుటిలో రంధ్రం పక్కనుంచి పోనివ్వడంతో ప్రమాదాన్ని తప్పించుకున్నారు. అధికారులు వెంటనే ఈ రంధ్రాలను పూడ్చాలని కోరుతున్నారు. రూ.17కోట్లతో నిర్మించిన ఈ బ్రిడ్జి కట్టిన రెండేళ్లకే దెబ్బతింది. ఈ రోడ్డు తాండూరు -మహబూబ్‌నగర్ జిల్లాను కలుపుతోంది. బ్రిడ్జి పాడవడానికి నాసిరకం పనులే కారణమంటున్నారు. ఈ విషయంలో ఇంజనీరింగ్ అధికారుల, కాంట్రాక్టర్ అవినీతి బయటపడిందని వాహనదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రిపూట ఈ రంధ్రంపై నుంచి వాహనాలు వెళ్తే భారీ ప్రమాదమే జరిగేదంటున్నారు. విషయం తెలుసుకున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఆర్టీఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డిలు బ్రిడ్జి వద్దకు చేరుకొని రంధ్రాలను పరిశీలించారు. ఆర్అండ్‌బీ వికారాబాద్ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్‌రెడ్డి వచ్చి పరిశీలించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బ్రిడ్జిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఇంత ప్రధాన బ్రిడ్జిని నాణ్యత లోపంతో కట్టిన కాంట్రాక్టర్‌పై, క్వాలిటీ కంట్రోల్ పరీక్షల్లో ఓకే చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రధ్రానికి వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. పరిశీలించిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రమేష్‌కుమార్, మహిళా మోర్చా నాయకురాలు సాహు శ్రీలత, కృష్ణ, భద్రేశ్వర్, మల్లేష్‌యాదవ్, కిరణ్ ఉన్నారు. కాగా బ్రిడ్జిపై ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. పరిశీలించిన అధికారుల్లో యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారు.



కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలి : ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

భూత్పూర్ జాతీయ రహదారిగా ఉన్న తాండూరు కాగ్నా నదిపై నాసిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బ్రిడ్జిని ఆయన పరిశీలించి మాట్లాడారు. కాగ్నా నదిలో వాటర్ ఫ్లో, వాహనాల రద్దీని గుర్తించి బ్రిడ్జిని నిర్మించాల్సి ఉందన్నారు. కానీ అలా చేయలేదని, గత పాలకుల నిర్లక్ష్యంతో పనులు నాసిరకంగా చేశారని ఆరోపించారు. ఎక్స్‌పర్ట్ కమిటీతో విచారణ చేయించాలని ఆయన కోరారు. ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిర్మాణంలో నాణ్యతపై పరిశీలించేందుకు సీసీ, మెటీరియల్‌ను ల్యాబ్ టెస్ట్‌కు పంపుతామన్నారు. బ్రిడ్జి పనులు నాసిరకంగా చేయడంతోనే పగుళ్ల, రంధ్రాలు పడ్డాయనే ఆరోపణలు వచ్చాయన్నారు. దీనిపై తాను ఉన్నతాధికారులకు నివేదికిస్తానని అన్నారు. రంధ్రాలు, పగుళ్లను మూసేస్తామని చెప్పారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి స్పందిస్తూ రంధ్రాలతో ప్రమాదం ఏర్పడకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కానిస్టేబుళ్లతో ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నామని, వాహనదారులు సహకరించాలని కోరారు.

శిథిలావస్థలో వ్యవసాయ శాఖ కార్యాలయం



కులకచర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయ భవనం శిథిలం కావడంతో కొంత కాలంగా వినియోగంలోలేకుండా పోయింది. చిన్న వర్షం వచ్చినా ఉరిస్తోంది. దీంతో ఏవో కార్యాలయాన్ని రైతు వేదికలోకి తరలించారు. ఈ విషయం తెలియక కార్యాలయానికి వచ్చిన రైతులు మూసి ఉన్న కార్యాలయాన్ని చూసి ఇబ్బందులు పడుతున్నారు. శిథిలమైన ఏవో కార్యాలయ స్థలంలో కొత్త భవనాన్ని నిర్మించాలని మండల రైతులు కోరుతున్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలు



తాండూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి):చంద్రవంచ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలు చేశారు. రెండు రోజులు జరిగిన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. కరన్‌కోట్‌కు చెందిన పూజారి సుజాన్ కుల్కర్ణి ఆధ్వర్యంలో మరో ఐదుగురు పండితులు పూజలు చేశారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని గ్రామశివారులోని కాగ్నా నది వరకు తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నవగ్రహపూజ, హోమం నిర్వహించారు. గ్రామస్తులు పటేల్ సుదర్శన్‌రెడ్డి, రవిశంకర్, సర్వోత్తంరావు, వెంకటయ్యగౌడ్, శేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుత్ కనెక్షన్‌కు ఎదురుచూపులు

● సుల్తాన్‌పూర్ రైతుల తిప్పలు
● కూలిన ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మె.. సింగిల్ ఫేస్ సరఫరాతో నడవని మోటార్లు





దిమ్మె కూలడంతో పనిచేయని సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు

బంట్వారం, జూలై27(ఆంధ్రజ్యోతి): మండల పరిధి సుల్తాన్‌పూర్‌లో విద్యుత్(త్రీఫేస్) సరఫరా ఇవ్వాలని గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా బోరు మోటార్లకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కాలానీల్లో బోరు మోటార్లు పనిచేయక, మిషన్ భగీరథ నీరు సరిగ్గా రాక నీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా క్రితం కురిసిన వర్షానికి గ్రామంలోని వాగుపక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మె కూలడంతో అవి పడిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచింది. అధికారులు స్పందించి గ్రామానికి వచ్చే సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మ్‌కు కనెక్షన్ ఇచ్చి వెళ్లారు. వ్యవసాయనికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మళ్లీ త్రీఫేస్ సరఫరా కావాలంటే కొత్తగా దిమ్మె కట్టాలని గ్రామస్తులకు విద్యుత్ అధికారులు సూచించారు. స్థానికులు ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. త్రీఫేస్ కరెంట్ లేక వారం అవుతున్నా ఏ ఒక్క అధికారీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పొలాల్లో నిలిచిన నీరు తెచ్చుకుంటున్నాం



గ్రామంలో త్రీఫేస్ కరెంటు లేక బోర్లు పనిచేయడం లేదు. తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. మిషన్ భగీరథ నీరు సరిగ్గా రావడం లేదు. కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నిలిచిన నీటిని తెచ్చుకొని వాడుకుంటున్నాం.

- భీంకుమార్, సుల్తాన్‌పూర్

అధికారులు స్పందించడం లేదు



అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. కొత్త దిమ్మె కట్టించి సమస్యను పరిష్కరించాలి. లేకుంటే ఆందోళనలు చేస్తాం.

- వీరేశం, సుల్తాన్‌పూర్

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

చేవెళ్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని శ్రీ సత్యసాయి సేవా సమితి తెలంగాణ రాష్ట్ర మహిళా యూత్ కో-ఆర్డినేటర్ నాగజ్యోతి, రంగారెడ్డి జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ శైలేష్ అన్నారు. ఆదివారం చేవెళ్లలో సత్యసాయి ఆలయ ఆవరణలో పల్లవి ప్రీ ప్రైమరీ స్కూల్, శ్రీ చైతన్య జూనియర్/డిగ్రీ కళాశాల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటారు. అంతకు ముందు సత్యసాయి మందిరంలో నగర సంకీర్తన, సత్యసాయిబాబా వారి సహస్ర నామార్చనలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మనవ మనుగడకు చెట్లు అవసరమన్నారు. మొక్కలు నాటి వాటికి రోజూ నీరుపోసి అవి వృక్షాలుగా ఎదిగేలా బాధ్యత తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లే ప్రధానం అన్నారు. అన్ని సెంటర్లలో మొక్కలు నాటుతాం అన్నారు. కార్యక్రమంలో సేవా ట్రస్ట్ చేవెళ్ల మండల కన్వీనర్ రామగౌడ్, ఫౌండర్ అయ్యావారి గోపాలచారి, సేవాదళ్ సభ్యులు వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, దివాకర్‌రెడ్డి, యూత్ కో-ఆర్డినేటర్ విజయ్‌కుమార్, శివశంకర్, మాధవరెడ్డి, భాస్కర్, ప్రభాకర్, విఠల్, సేవాదళ్ మహిళా సభ్యులు ప్రభావతి, స్వరూప, సుమలత, ఆబిజ్ఞ, శశిరేఖ, స్వప్న పాల్గొన్నారు.

ఘనంగా ఎల్‌హెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్

కొడంగల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎల్‌హెచ్‌పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం అంబేడ్కర్ చౌరస్తాలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ట్రైబల్ వెల్ఫేర్ జీవో ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో వంద శాతం రిజర్వేషన్లు అమలుచేయాలన్నారు. గిరిజనుల సమస్యలపై సోమవారం స్థానిక గిరిజన సంక్షేమ భవనంలో చర్చిస్తామని తెలిపారు. తండాలను రెవెన్యూ పంచాయతీలుగా ఏర్పాటు, కులగణనలో లంబాడా జనాభా బహిర్గతం, లావణి పట్టా, సీలింగ్, పోడు భూములపై పూర్తిహక్కులతో చట్టం రూపకల్పన, గిరిజనులకు వివిధ రకాల వాహనాలపై సబ్సిడీ అంశాలపై చర్చిస్తామన్నారు. గిరిజన హక్కులపై ఇందిరాపార్కు ధర్నాచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్, బాలకృష్ణ, మోతీలాల్, సుభాష్, లక్ష్మణ్, సామ్యానాయక్, ఉమ్లీబాయి, బుజ్జిబాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

బషీరాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్మాయికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు జి.మాధవరెడ్డి, ఎ.వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాని తరలివచ్చారు. అనంతరం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సమక్షంలో వంద మంది వరకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ కాశప్ప, మధుసూదన్, వెంకటప్ప, శ్యామప్ప. రవి, నర్సప్ప, గంగాధర్, మధు, వెంకటయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు


నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, భాస్కర్‌రెడ్డి తదితరులు

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

కడ్తాల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు మరువలేనివని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఆమనగల్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు అన్నారు. శాస్త్రవేత్తగా దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప మహనీయుడు కలాం అని కొనియాడారు. కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం భారతరత్న, మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు లక్ష్మయ్య, రామచందర్ నాయక్, మల్లేశ్ గౌడ్, క్యామ రాజేశ్, షాబోద్దీన్, నరేశ్, జహంగీర్ అలీ, జహంగీర్ బాబా, యాదగిరి రెడ్డి, శ్రీను, అస్గర్‌అలీ, లక్పతినాయక్, కేశవులు, సుధాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జైపాల్‌రెడ్డి వర్ధంతి

ఆమనగల్లు, జూలై 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూదిని జైపాల్ రెడ్డి 6వ వర్ధంతిని నేడు(సోమవారం) హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో గల స్ఫూర్తి స్థల్‌లో నిర్వహిస్తున్నట్లు పీసీసీ సభ్యుడు రాంరెడ్డి, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో పాటు ఏఐసీసీ, పీసీసీ ప్రతినిధులు హాజరవుతున్నారని, జైపాల్‌రెడ్డి అభిమానులు, నాయకులు, తరలిరావాలని కోరారు.

నిండుకుండలా..

- జలాశయాలకు పెరిగిన వరద
- అలుగు పారిన చెరువులు
- అన్నదాతల ఆనందం


షాబాద్ : వర్షపునీరు చేరి నిండుకుండను తలపిస్తున్న పహిల్వాన్ చెరువు


శంషాబాద్ : అలుగు పారుతున్న కాముని చెరువు


వరదనీరు చేరడంతో మొయినాబాద్ మండలంలోని హిమాయత్‌సాగర్‌లో పెరిగిన నీటిమట్టం

షాబాద్/మొయినాబాద్ రూరల్/శంషాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): గత ఐదారు రోజులుగా కురిసిన వర్షాలకు జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటలు నీటితో నిండుకుండల్లా కనువిందు చేస్తున్నాయి. షాబాద్ మండలంలో దేవునిగడ్డ చెరువు అలుగుపారింది. షాబాద్‌లోని పహిల్వాన్ చెరువు నిండు కుండలా మారింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే మొయినాబాద్ మండల పరిధిలోని ఈసీ, మూసీ వాగుల్లో వరద పారింది. జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లలో నీటి మట్టం నెమ్మదిగా పెరిగింది. ఈసీ వాగు ద్వారా హిమాయత్ సాగర్ జలాశయానికి ఆదివారం వరద వచ్చి చేరగా.. సాయంత్రానికి నీటి మట్టం పెరిగింది. ఉస్మాన్‌సాగర్(గండిపేట)కు సైతం మూసీ వాగు వరద రాగా.. నీటి మట్టం భారీగా పెరిగింది. హిమాయత్ సాగర్ జలాశయంలోకి మరో రెండు అడుగుల మేర వరద వస్తే పూర్తిస్థాయి నీట్టి మట్టానికి చేరుకుంటుంది. గండిపేట చెరువుకు మరింత వరద నీరు వచ్చే అవకాశం ఉంది. అలాగే శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని కాముని చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా నిండిపోయి అలుగుపారింది. ఇటీవల శంషాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరంతా చెరువులోకి చేరి పూర్తిగా నిండింది. ఆ నీరంతా రాళ్లగూడలోని జోషి కుంటలోకి వెళుతోంది. ఇదిలా ఉండగా, జోషి కుంట నిండిన తరువాత నీరు హిమాయత్‌సాగర్‌లోకి చేరుతుంది.

యాచారంలో వెలవెల!

యాచారం, జూలై 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నా యాచారం మండలంలో కేవలం గత ఐదు రోజులుగా ముసురు పడింది. వర్షంతో పత్తి, కంది, జొన్న, టమాట తోటలకు మేలు జరిగిందని రైతులు చెబుతున్నారు. కానీ, మండలంలోని వివిధ గ్రామాలలో మొత్తం 120 చెరువులు, కుంటలున్నాయి. అయ అయితే, ఐదు రోజులు ముసురుపడినా అవి నిండలేదు. తాటిపర్తి బందం చెరువులోకి నెల రోజులక్రితం కురిసిన భారీ వర్షానికి వరద నీరు వచ్చి చేరింది. కాగా, చెరువులు, కుంటలు నిండకపోవడంతో వరి సాగు గగనమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట పంటలకు మాత్రం ఎలాంటి ఢోకా లేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.


కొద్దిపాటి నీటితో వెలవెలబోతున్న నానక్‌నగర్ చెరువు

క్రైం కార్నర్

దుస్తులకు నిప్పంటించి.. ఆమ్లెట్ వేసుకొని తిని..

- చోరీ చేసేందుకు వచ్చిన దొంగ నిర్వాకం
- ఇంట్లో డబ్బు, నగలు దొరకలేదని వింత చేష్టలు

షాద్‌నగర్ రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇంట్లో చోరీ చేసేందుకు వచ్చిన దొంగకు నగలు, డబ్బు దొరక్కపోవడంతో వింత చేష్టలకు పాల్పడ్డాడు. పట్టణంలోని ఆఫీసర్స్ కాలనీకి చెందిన తిరుపతిగౌడ్‌కు చెందిన మొదటి అంతస్తులో నివాసముండే కుటుంబం.. మూడు రోజులక్రితం వేరే గ్రామానికి వెళారు. ఈక్రమంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దొంగ బిల్డింగ్ వెనుక నుంచి పైఅంతస్తుకు చేరుకున్నాడు. తిరుపతిగౌడ్ ఇంటి తాళం విరగ్గొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. అనంతరం బీరువా తాళం విరగ్గొట్టి చూడగా అందులో బంగారం, నగదు ఇతర విలువైన వస్తువులు ఏమీ కనిపించలేదు. దాంతో బీరువాలో ఉన్న దుస్తులు బయటకు తీసి నిప్పు పెట్టాడు. అనంతరం ఎంచక్కా కిచెన్‌లోకి వెళ్లి తీరిగ్గా ఆమ్లెట్ వేసుకొని మరీ ఆరగించాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ఇంటి యజమాని తిరుపతిగౌడ్ తెలిపారు.


నిప్పంటించడంతో కాలిపోయిన దుస్తులు

బైక్‌ను ఢీకొన్న ట్రావెల్ బస్సు.. వ్యక్తి మృతి

ఆదిభట్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలోని మన్నెగూడ మహోనియా ఆసుపత్రి సమీపంలో బైక్‌ను ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో బైక్‌పై వెళుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందని ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై నోయెల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్‌లోని కమ్మగూడలో నివాసముంటున్న సిలివేరు కనకయ్య(45) ఆదివారం బైక్‌పై వెళుతూ మన్నెగూడలోని మహోనియా ఆసుపత్రి సమీపంలో యూటర్న్ తీసుకునేందుకు యత్నించాడు. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వేగంగా వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు(ఎన్ఎల్-02బీ 3002), బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో కనకయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక తరలింపుపై నిర్లక్ష్యం!

మాడ్గుల, జూలై 27(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి వదిలేస్తున్నారని, సమాచారం ఇచ్చినా పోలీసులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆర్కపల్లి జీపీ పరిధి ఆసిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు అందుగుల వాగు నుంచి అనుమతుల పేరుతో ట్రాక్టర్ల యజమానులు ఇష్టానుసారంగా ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. శనివారం ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ఆపి పోలీసులకు సమాచారం ఇవ్వగా స్పందించకపోవటంతో డయల్ 100కు ఫోన్‌చేయగా.. దాంతో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఆసిరెడ్డిపల్లికి చేరుకొని ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వాటిని తిరిగి అప్పగించారు. ఈ విషయమై సీఐ వేణుగోపాల్‌ను వివరణ కోరగా ఇన్‌చార్జి ఎంపీడీవోను, గ్రామ కార్యదర్శులను వివరాలు అడిగానని, అనుమతులు ఉన్నాయని చెప్పారు.

ముదిరాజ్ గ్రామ కమిటీల ఏకగ్రీవం

కందుకూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులమైలారం, బేగంపేట, తిమ్మాపురం, మీర్కాన్‌పేట, బేగరికంచ గ్రామాల్లో ముదిరాజ్ కమిటీలను ఏకగ్రీవం చేసినట్లు ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు పిట్టల పాండు ముదిరాజ్ తెలిపారు. ఆదివారం ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన సమావేశాల అనంతరం ఆయన మాట్లాడారు. ఆకులమైలారం ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా బి.మల్లేష్‌ముదిరాజ్, అనేమోని నరహరి ముదిరాజ్, యూత్ అధ్యక్షుడిగా కె.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా అనేమోని శ్రీనివాస్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. బేగంపేట గ్రామశాఖ అధ్యక్షుడిగా పల్లె శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడిగా ఎ.రమేష్, ప్రధాన కార్యదర్శిగా పి.నర్సింహ, ఉపాధ్యక్షులుగా పి.సుధాకర్‌ను, తిమ్మాపురం గ్రామశాఖ అధ్యక్షుడిగా సన్నీళ్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ఎ.వీరస్వామి, ఉపాధ్యక్షుడిగా అంబటి వెంకటేష్, యూత్ అధ్యక్షుడిగా జె.సాయి, మీర్కాన్‌పేట గ్రామ అధ్యక్షుడిగా కాకి రవీందర్‌ముదిరాజ్, బేగరికంచ గ్రామ శాఖ అధ్యక్షుడిగా డిల్లీ సురేందర్, యూత్ అధ్యక్షుడిగా డిల్లీ మహేందర్ ముదిరాజ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని తిమ్మాపురంలోని తిమ్మచెరువు సంఘం అధ్యక్షుడిగా అరిగే రాఘవేందర్ ముదిరాజ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ గ్రూప్-డీ నుంచి గ్రూప్-ఏలో చేర్చాలని కోరారు. జనాభా ప్రకారం రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విడుదల కాని నిధులు.. అసంపూర్తిగా పనులు

(ఐదో పేజీ తరువాయి)

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. 2023 జూన్ 17న బంజారా భవన్ నిర్మాణానికి అప్పటి కలెక్టర్ హరీశ్‌తో కలిసి జైపాల్ యాదవ్ శంకుస్థాపన చేశారు. కాగా ఏడాది గడిచినా పనులు ప్రారంభం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024లో టెండర్లు నిర్వహించి 8 నెలల క్రితం పనులు ప్రారంభించారు. నాలుగు నెలల్లో గోడలు, షెడ్డు నిర్మాణం పనులు పూర్తి చేశారు. రూ. 80లక్షల వరకు పనులు చేపట్టినప్పటికీ నిధులు విడుదల కాలేదు. దీంతో నాలుగు నెలల క్రితం కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. నిధుల విడుదలకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ చూపి భవన నిర్మాణం పూర్తి చేయాలని గిరిజన నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



బంజారా భవన్ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండానే పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. దీంతో బిల్లులు విడుదల కాక పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈవిషయం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోయాం. స్పందించిన ఆయన వెంటనే నిధులు విడుదలచేసి పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

- కృష్ణనాయక్, గిరిజన నేత, ఆమనగల్లు

బీజేపీ పట్టణ నూతన కార్యవర్గం

షాద్‌నగర్ అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ షాద్‌నగర్ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్టు పట్టణాధ్యక్షుడు కోరమోని హరిభూషణ్‌పటేల్ తెలిపారు. సీనియర్ నాయకుల సూచనల మేరకు ఎంపిక చేసిన నూతన కార్యవర్గ జాబితాను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్‌కు ఆదివారం సమర్పించినట్టు తెలిపారు. బీజేపీ పట్టణ కమిటీ ఉపాధ్యక్షులుగా ఎం.రమేష్, రామకృష్ణ, అనిల్‌గౌడ్, జి.అనిత, ప్రధాన కార్యదర్శులుగా జె.నర్సింహులు, జి.విజయ్‌కుమార్, కార్యదర్శులుగా బి.సుధామాధురి, నీరజ్ రెడ్డి, ఎన్.మనోహర్, పి.రాజేష్, కోశాధికారిగా జి.ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా పి.సుమవాణి, ఎన్.మల్లేష్, దివాకర్ తివారి, ఆర్.గోపీనాథ్, బి.రాజు, బి.రవి, ప్రదీప్‌లను ఎంపిక చేసినట్టు హరిభూషణ్ తెలిపారు.


నూతన కార్యవర్గ జాబితాను రాజ్‌భూపాల్ గౌడ్‌కు అందిస్తున్న హరిభూషణ్

ఘనంగా పోచమ్మ బోనాలు


ఆదిభట్ల : బోనం తీసుకెళ్తున్న మాజీ జడ్పీటీసీ నిత్యా నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ కేంద్రంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనం ఎత్తుకొని డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుని పిల్లా పాపలను సల్లంగా చూడాలని వేడుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కోరె కళమ్మ జంగయ్య, మాజీ జడ్పీటీసీ నిత్యా నిరంజన్ రెడ్డి, పల్లె గోపాల్‌గౌడ్, నల్లవోలు లావణ్య పాండు రంగారెడ్డి, పల్లె రజినీకాంత్‌గౌడ్, సాంబయ్య, సాయిబాబా, బండ రాజు, మహిళలున్నారు.

బోనమెత్తిన గిరిజనులు

తలకొండపల్లి : మండల పరిధిలోని పాతకోట తండాలో ఆదివారం గిరిజనుల ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోనాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. బోనాల వేడుకలకు నాయకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. బోనాల వేడుక గిరిజన సంస్కృతి, సంప్రదాయాన్ని చాటింది. అలాగే బోనాల వేడుకల్లో ఆమనగల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో మాజీ సర్పంచ్ అలివేలు జీర్యనాయక్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, రాజేందర్‌నాయక్, రాంచందర్‌నాయక్, గణేశ్, కొట్రాజ్, గణేశ్, దేశ్యనాయక్, జగన్‌నాయక్, మల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీను నాయక్, ధర్మనాయక్, డాక్యనాయక్, శ్రీను నాయక్, రాంచందర్ నాయక్, గోపాల్ నాయక్, తిరుపతినాయక్, రమేశ్‌నాయక్, పిర్యానాయక్, హుమ్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.


తలకొండపల్లి : బోనాల ఊరేగింపులో గిరిజనులు

సత్యనారాయణస్వామి వ్రతాలు

తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల గ్రామంలోని శ్రీ వేదాద్రి లక్ష్మీనరసింహ ఆలయంలో ఆదివారం ఏఎంసీ డైరెక్టర్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు, వ్రతాలు కొనసాగాయి. కార్యక్రమానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో నర్సింహరాజు రెడ్డి, గణేశ్, సురేశ్, మల్లేశ్, శ్రీను, రాజు, రాంచందర్, శేఖర్, పురుషోత్తం, రాజలింగం, శ్రీశైలం, దశరథం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో ప్రభాకర్ రెడ్డి తదితరులు

కంటి వైద్యశిబిరం విజయవంతం


కంటి వైద్యశిబిరంలో లయన్స్‌క్లబ్ సభ్యులు, తదితరులు

మంచాల, జూలై 27(ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో మంచాలలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సాధూరాం కంటి ఆసుపత్రికి చెందిన వైద్యబృందం రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దృష్టిలోపం ఉన్నవారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాధూరాం కంటి ఆసుపత్రి డాక్టర్ ఎం.ఎస్.రెడ్డి, ఆర్‌బీఎల్‌ఎల్‌బీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు డా.కె. భిక్షపతి, వీరశైవ లింగాయత్ సంఘం మండలాధ్యక్షుడు కె.శేఖరప్ప, ప్రధాన కార్యదర్శి జక్కా హరీష్, బాల్‌రాజ్, వీరమల్లప్ప, ఈశ్వరప్ప, ప్రవీణ్‌కుమార్, బీఎస్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత జీవితం


విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సయ్యద్‌ఖలీల్

ఆమనగల్లు, జూలై 27(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజంలో గౌరవం, ఉన్నత జీవితం లభిస్తుందని బీఆర్ఎస్ మైనారిటీ సెల్ జిల్లా నాయకుడు సయ్యద్ ఖలీల్ అన్నారు. విద్యాధికులు అధికంగా ఉన్న ప్రాంతాలు వేగవంతంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామం సమీపంలో ఉన్న జామియా ఇస్లామియా దారుల్ ఉలుం మదర్సా పాఠశాల విద్యార్థులకు సయ్యద్ ఖలీల్ దుప్పట్లు సమకూర్చారు. ఆదివారం ప్రిన్సిపాల్ మౌలానా అబ్దుల్ కరీంషా ఖాద్రి స్థానిక నాయకులతో కలిసి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. నాయకులు మహబూబ్, ఫారుక్, రఫీ, హనీఫ్, నిజాముద్దీన్‌బాబా, అబ్బు, కలీమ్, అఫ్సర్, అజీం, అఫ్రోజ్, హఫీజ్, షైమద్, ముస్తఫా, ఇర్ఫాన్, సోయబ్, సోహెల్, మేరాజ్, తదితరులున్నారు.

రేషన్ కార్డుల పంపిణీకి హాజరుకావాలి

ఆమనగల్లు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో నేడు(సోమవారం) రైతువేదిక వద్ద రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తహసీల్దార్ లలిత ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. నూతనంగా రేషన్ కార్డులు మంజూరైన వారు, కార్డుల్లో పేర్లు నమోదు చేసుకున్న లబ్ధిదారులు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో రావాలని తహసీల్దార్ కోరారు.

ప్రగతి నిరోధకాలుగా విపక్షాలు

- యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దయాసాగర్‌రెడ్డి

కడ్తాల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విపక్షాలు ప్రతిదీ రాజకీయం చేస్తూ ప్రగతి నిరోధకంగా మారాయని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిగురింత దయాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దారెడ్డి అంజన్‌రెడ్డిలు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రాష్ట్రంలో విపక్షాలు కనుమరుగుకాక తప్పదన్నారు. కడ్తాల మండలంలో ఆదివారం దయాసాగర్‌రెడ్డి, అభినవ్‌రెడ్డిలు పర్యటించారు. గోవిందాయిపల్లిలో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెంది కష్టాల నుంచి వైదొలగాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని అన్నారు. ప్రభుత్వ పథకాలను యువజన కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి తీసుకువెళ్లాని సూచించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు వారిని సన్మానించారు. నాయకులు శేఖర్ గౌడ్, రతన్, మల్లేశ్, వినోద్, రవి, శివ, సిద్ధు, భిక్షపతి, తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొత్తూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాపిరస్‌పోర్టు రిసార్టులో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. షాద్‌నగర్ నలంద జూనియర్ కళాశాల 1999-2001 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు ఒకచోట కలుసుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు వీరభద్రం, వెంకటరమణలను శాలువాలతో సన్మానించారు. కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. పూర్వవిద్యార్థులు బొర్ర ప్రవీణ్‌రెడ్డి, వెంకటదాస్, శేఖర్, సుధారాణి, రాధావేణి, సంతోష్, వీరేందర్, గిరిబాబు, గోవర్ధన్‌రెడ్డి, పవన్, రాఘవేందర్ తదతరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న కుమార్ సాను మ్యూజికల్ షో

శంషాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో శనివారం రాత్రి క్లాసిక్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన మ్యూజికల్ షో సంగీతాభిమానులను ఆకట్టుకుంది. ఓ ప్రైవేటు సంస్థ క్లాసిక్ కన్వెన్షన్‌లో ప్రముఖ గాయకుడు, ఫిలింఫేర్ అవార్డు గ్రహీత కుమార్ సానుచే మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసింది. చురాహై మేరా దిల్‌కా షోరీ కహచలీ, జాదూ నేరీనజర్ వంటి హిందీ మధురగీతాలు ప్రేక్షకులను, సంగీతప్రియులు ఉర్రూతలూగించాయి.


గీతం ఆలపిస్తున్న కుమార్ సాను

అస్తవ్యస్తంగా చింతపల్లిగూడ రోడ్డు

ఆదిభట్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని చింతపల్లిగూడకు వెళ్లే రోడ్డు చిత్తడిగా మారి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలు పడి మురుగునీరు నిలుస్తుండటంతో చింతపల్లిగూడ, మల్‌శెట్టిగూడ, రాందాస్‌పల్లి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు గుంతలు పడిన చోట మట్టి పోసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


చింతపల్లిగూడ-రాందాస్‌పల్లి రోడ్డుపై నిలిచిన మురుగు